సాక్షి
పల్నాడు
బుధవారం ၊ 31 ၊ జూలై ၊ 2024



పార్వతీ అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి మంగళవారం భక్తులు సారె సమర్పించారు.



వైభవంగా కుమారస్వామి కల్యాణం

తెనాలిఅర్బన్: కుమారస్వామి జన్మదినం సందర్భంగా గంగానమ్మపేటలోని పాత శివాలయంలో మంగళవారం స్వామివారికి కల్యాణం, విశేష అభిషేకాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

దూరవిద్య ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సమన్వయకర్త కె.ఎం.ఎ.హుస్సేన్ మంగళవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 31వతేదీ నుంచి ఆగస్టు 27వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 28వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. అపరాధ రుసుం రూ.200తో సెప్టెంబర్ 4వ తేదీవరకు ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లించవచ్చని వివరించారు. అభ్యర్థులు తమ దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని దూరవిద్య ఏ1 సెంటర్లలో ఆన్‌లైన్ సబ్‌మిషన్ ఫామ్ సమర్పించి ప్రవేశాలు పొందాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు...

పల్నాడుజిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు రాష్ట్ర, ఎస్ఎఫ్‌టీడబ్ల్యూ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఆగస్టు 5వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. మండలస్థాయిలో ఎంఈఓ–1 చైర్మన్‌గా నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆగస్టు 7వ తేదీన మండలస్థాయి తుది జాబితాను డివిజనల్ స్థాయి కమిటీకి అందచేయవలసి ఉంటుందన్నారు. అలాగే డిప్యూటీ డీఈఓ చైర్మన్‌గా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ డివిజనల్ స్థాయి తుది జాబితాను ఆగస్టు 10వ తేదీన జిల్లాస్థాయి కమిటీకి అందజేయాలన్నారు. జిల్లాస్థాయి నుంచి ఆగస్టు 17వ తేదీన తుది జాబితాను రాష్ట్రస్థాయి కమిటీకి అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను గడువులోపు అందివ్వాలని కోరారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రమాదకరం

ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన పొగాకు వ్యతిరేక లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు




నరసరావుపేట: పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రమాదకరమని పొగాకు వ్యతిరేక లా ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేట్ లీగల్ సెల్ ఆఫీసర్ పుట్టి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రకాష్ నగర్ రిక్షా సెంటర్ నుంచి బస్టాండ్ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంక్రమించే క్యాన్సర్, ఇతర వ్యాధులపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రకాష్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురు, వినుకొండ రోడ్డు పొగాకు ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను తనిఖీచేసి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసేవారికి, దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ స్వర్ణరాజేశ్వరి, ఎస్ఐ బాలునాయక్, డీసీఎం, సోషల్ వర్కర్ నందిగం సురేష్, కానిస్టేబుల్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ మంగళవారం తెలిపారు. అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 517.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,944 ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,781 ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 29,565 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 2,52,386 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

తమ్ముళ్ల మందు చూపు

టీడీపీ నేతల కనుసన్నల్లో ఏరులై పారుతున్న అక్రమ మద్యం

- గోవా, తెలంగాణ నుంచి మద్యం తెచ్చి పల్నాడు జిల్లాలో విక్రయిస్తున్న నేతలు
- ప్రతివారం ప్రత్యేక కంటైనర్లలో దిగుమతి
- నేరుగా మండలాలకు సరఫరా..
- మద్యం తెస్తూ బొల్లాపల్లిలో అరెస్ట్ అయిన వినుకొండ టీడీపీ నేత దావులూరి వీరాంజనేయులు
- తెలుగు తమ్ముళ్ల గొడవలతో బయటకు వస్తున్న అక్రమాలు
- పట్టించుకోని ఎస్ఈబీ అధికారులు



ఈపూరు ఎస్ఈబీ పోలీసులకు ఈ నెల 18వ తేదీన గోవా మద్యంతో పట్టుబడ్డ టీడీపీ నేత దావులూరి వీరాంజనేయులు (వృత్తంలో ఉన్న వ్యక్తి), ఇతరులు

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్నాడు జిల్లాలో అక్రమ మద్యం మూడు బీర్లు, ఆరు క్వార్టర్లుగా నడుస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు కాసులు మూటగట్టుకుంటున్నారు. గోవా, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి పల్నాడు జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సైతం సరఫరా చేసి తెగ తాగించి అనారోగ్యం పాలు చేస్తున్నారు. మన రాష్ట్రంలో మద్యం ధరలతో పోల్చితే ఆయా రాష్ట్రాలలో ధరలు తక్కువగా ఉంటున్నాయి. దానికి కారణం... గోవా రాష్ట్ర కేంద్రపాలిత ప్రాంతం కాగా.. తెలంగాణలో మద్యం తయారీకి వాడే స్పిరిట్ ఏపీ మద్యంలో వాడే స్పిరిట్ కన్నా చవకైనది కావడం. నాసిరకం స్పిరిట్ వాడిన మందు తక్కువ ధరలో లభ్యం అవుతుండటంతో పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి టీడీపీ నేతలు మద్యం బాబుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

గోవా నుంచి కంటైనర్ల ద్వారా సరుకు...

టీడీపీ నేతలు చేస్తున్న అక్రమ మద్యం వ్యాపారానికి సరుకు ఎక్కువ భాగం గోవా నుంచి తెప్పిస్తున్నారు. మద్యం ధరలు చాలా తక్కువగా ఉండటం, అక్రమ మద్యం సరఫరా చేసే డీలర్లతో డీల్ కుదుర్చుకోవడంతో అక్కడి నుంచి నేరుగా కంటైనర్ వాహనాలలో పల్నాడు జిల్లాకు తెస్తున్నారు. బార్డర్‌లో స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధుల సహకారంతో వాహనాల తనిఖీలు లేకుండా చూసుకుంటున్నారు. అక్కడి నుంచి గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలలోని మండలాలకు మద్యం సరఫరా చేస్తున్నారు.

బార్‌లలో సైతం..

పల్లెల్లోని బెల్టుషాపులకే కాకుండా ఏకంగా ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న బార్ షాపులలో సైతం తెలంగాణ మద్యం సరఫరా చేస్తున్నారు. గురజాల పట్టణంలో ఓ గదిని అద్దెకు తీసుకొని అక్కడినుంచి బార్‌లకు ఈ అక్రమ మద్యం సరఫరా చేస్తున్నట్టు సెబ్ అధికారుల వద్ద సమాచారం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే అధికారపార్టీ నేతల ఒత్తిడి వల్ల ఆ డంప్‌పై సోదాలకు వెనుకాడుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవల గురజాల సెబ్ పోలీసులు ఓ అక్రమ మద్యం సరఫరా చేసే కొరియర్‌ను అరెస్ట్ చేయగా అతని వద్ద తెలంగాణ మద్యంతో పాటు బీర్లు, బడ్‌వైజర్లు దొరకడం ఆశ్చర్యంగా ఉందని సిబ్బంది చెబుతున్నారు. మద్యం ప్రియులు ఇష్టపడే కొన్ని బ్రాండ్ బీర్లు జిల్లాలో దొరక్కపోవడంతో తెలంగాణ నుంచి అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

పట్టించుకోని ఎస్ఈబీ...

అక్రమ మద్యం అరికట్టడానికి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)ను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్వీర్యం చేయాలని చూస్తోంది. సెబ్‌ను తిరిగి ఎక్సైజ్‌లో విలీనం చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో సెబ్ అక్రమ మద్యంపై ప్రత్యే క దృష్టి సారించలేకపోతోంది. గడిచిన రెండు నెలల వ్యవధిలో పల్లెల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బెల్టు షాపులు వెలిశాయి. ఇది ఇలా ఉండగా ఇతర రాష్ట్రాల మద్యం సరఫరా చేసేవారిని పట్టుకున్న సమయంలో సిబ్బందిపై దాడులు చేస్తున్నా ఉన్న తాధికారులు ఏమి చేయడం లేదని కింద స్థాయి సిబ్బంది వాపోతున్నారు. అక్రమ మద్యం విషయంపై పల్నాడు జిల్లా ఎస్ఈబీ ఈఎస్ ఖాజామొహిదుద్దీన్‌ని వివరణ కోరగా జిల్లాలో తెలంగాణ, గోవాల నుంచి వస్తున్న అక్రమ మద్యం సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి అరికడుతున్నామన్నారు. సిబ్బంది తక్కువ ఉన్నప్పటికీ గ్రామాలలో బెల్టుషాపుల నిర్వాహకులను అరెస్ట్ చేస్తున్నామన్నారు.

పరస్పర ఫిర్యాదులతో విషయం బయటకు...

ఈ దందా కోసం టీడీపీ నేతల్లో వచ్చిన గొడవల నేపథ్యంలో వీరి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.. ఒకరిపై ఒకరు సమాచారం ఇచ్చి పక్క రాష్ట్రాల మద్యాన్ని పట్టిస్తున్నారు. ఈ నెల 18న గోవా మద్యం తెస్తున్న వినుకొండ మండల టీడీపీ నేత దావులూరి వీరాంజనేయులు, మరో ముగ్గుర్ని ఈపూరు సెబ్ పోలీసులు బొల్లాపల్లి మండలం మర్రిపాలెం వద్ద అరెస్ట్ చేశారు. వీరాంజనేయులు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. ఇతను గోవా మద్యాన్ని వినుకొండ మండలంలోని పలు గ్రామాల్లోని బెల్టుషాపులకు సరఫరా చేస్తుండగా కొందరు టీడీపీ నేతలే సమాచారం ఇచ్చి పట్టించినట్లు తెలుస్తోంది. బెల్టుషాపుల కోసం తమ్ముళ్ల గొడవ పడటమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈపంచాయితీ ఎమ్మెల్యే వద్దకు సైతం చేరిందని సమాచారం.



వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెనతో సన్నిహితంగా ఉన్న దావులూరి వీరాంజనేయులు (ఫైల్)

మెనూ పాటించకుంటే చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- తిమ్మాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనం తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

యడ్లపాడు: పాఠశాలల్లో డ్రాపౌట్ల నివారణతో పిల్లలకు పౌష్టికాహారం అందించే విషయాల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు హెచ్చరించారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న భోజన పథకాన్ని పరిశీలించారు.

హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు..

మంగళవారం పాఠశాలలో మెనూ ప్రకారంగా వండిన పులిహోర, కోడిగుడ్ల పంపిణీని పరిశీలించారు. వడ్డన పూర్తయ్యే వరకు స్వయంగా గమనించారు. పాఠశాలలోని 186 మంది విద్యార్థులకు గానూ 9 మందికి కోడిగుడ్లు తగ్గాయి. దీంతో అందరికీ సరిపోయే విధంగా ఎందుకు గుడ్లు ఎందుకు సిద్ధం చేయలేదంటూ ఏజెన్సీ నిర్వాహకులను కలెక్టర్ ప్రశ్నించగా, కొన్ని పాడయ్యాయని సమాధానం చెప్పారు. పాడైతే వాటిస్థానంలో మరికొన్నింటిని సిద్ధం చేయాలని, అదే మీ ఇంట్లో అయితే ఇలానే చేస్తారా.. అంటూ ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా పాడైన కోడిగుడ్లను తెచ్చి చూపించాలనడంతో అధికారులు వెళ్లి వంటగదిలో పరిశీలన చేసి అలాంటివి ఏమీ లేవంటూ చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాకుతో పాటు ఇతర విషయాలను సమగ్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలంటూ డీఈఓ. ఎం.వెంకటేశ్వర్లను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హైస్కూల్ హెచ్ఎం ఏవీ నాయుడు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు డీఈఓ తెలిపారు. తహసీల్దార్ మొహమ్మద్ అష్రిఫున్నిసా బేగం, ఎంపీడీఓ వై శ్రీనివాసరావు, ఎంఈఓలు ఉన్నారు.

జనం గుండెల్లో బోగీ మంటలు

- ఇక్కట్ల రైలు ప్రయాణం
- అరకొర బోగీలతో సరి
- జనరల్ ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- కనీస వసతులూ కరువు
- పెరుగుతున్న ఏసీ కోచ్‌లు
- వందేభారత్ రైళ్లపైనే శ్రద్ధ
- కేంద్రం తీరుపై వెల్లువెత్తుతున్న నిరసన



శబరి ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి,గుంటూరు, లక్ష్మీపురం, తెనాలి రూరల్: రైళ్లలోని జనరల్ బోగీలు నరకానికి నకళ్లుగా మారాయి. ఫలితంగా ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. వందల కిలోమీటర్ల దూరం నిలువు కాళ్లపై నిలబడే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో మహిళలు, పిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం తీరుపై మండిపడుతున్నారు. ఏసీ కోచ్‌లు, వందేభారత్ రైళ్లపై ఉన్న శ్రద్ధ సామాన్యులు వెళ్లే జనరల్ బోగీలపైనా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం వివిధ రైళ్లలో జనరల్ బోగీలపై 'సాక్షి' జరిపిన పరిశీలనలో ఈ విషయాలు బయటపడ్డాయి.

రెండే జనరల్ బోగీలు

గుంటూరు స్టేషన్ నుంచి నిత్యం సుమారుగా 20 వేల మందికిపైగా ప్రయాణం చేస్తుంటారు. గుంటూరు రైల్వే స్టేషన్‌కు నిత్యం సుమారుగా 65 రైళ్లు వస్తుంటాయి. వీటిలో ప్రధానంగా సికింద్రాబాద్, వైజాగ్, తిరుపతి, గుంతకల్లు, పిడుగురాళ్ల, విజయవాడ, రాజమండ్రి, వైపుగా ప్రయాణించే రైళ్లు ఉన్నాయి. ఈ స్టేషన్ మీదుగా ప్రయాణించే వాటిలో సికింద్రాబాద్–తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్, హౌరా – సికింద్రాబాద్ నడిచే ఫలక్‌నుమా, సికింద్రాబాద్ – భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, వాస్కో–షాలీమార్ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ – బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉన్నాయి. వీటిల్లో ప్రయాణికులు కనీసం నిలబడేందుకూ స్థలం లేక నరకయాతన అనుభవించారు. బోగీలో కనీసం తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దుర్గంధం వెదజల్లుతున్నాయి. వాటివద్దే ప్రయాణికులు కూర్చుని, నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

హైదరాబాద్ నుంచి నిలువుకాళ్లపైనే



సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్ 20 నిముషాలు ఆలస్యంగా సాయంత్రం 5.20 గంటలకు గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ రైలులో జనరల్ బోగీలు రెండే ఉన్నాయి. అవీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. మహాలక్ష్మి అనే ప్రయాణికురాలు తన బిడ్డలతో కలిసి హైదరాబాద్ నుంచి గుంటూరు వరకూ నిలువు కాళ్లపై నిల్చొనే ప్రయాణం చేస్తూ వచ్చింది.

టాయిలెట్లూ అస్తవ్యస్తం



అద్దం లేని టాయిలెట్ కిటికీ

ధన్‌బాద్ నుంచి అలెప్పి వెళ్లే ఎక్స్‌ప్రెస్ మంగళవారం మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 7.50 గంటలకు తెనాలి రైల్వే స్టేషన్‌కు వచ్చింది. 24 బోగీలు ఉన్న ఈ రైలులో మూడు మాత్రమే జనరల్ బోగీలు. ఫలితంగా వీటిల్లో జనం కిక్కిరిసిపోయారు. వీటిలో 80 మంది చొప్పున ప్రయాణించేందుకే అవకాశం ఉంటుంది. కానీ సుమారు 140 మంది వరకు ఉన్నారు. రెండు జనరల్ బోగీల బాత్‌రూమ్‌లకు కిటికీ అద్దాలు లేవు. అందులోకి వెళ్లిన వ్యక్తి బయటకు కనపడేలా ఉన్నాయి. తలుపు దగ్గర, నడిచే దారిలో, ఆఖరికి టాయిలెట్ల వద్ద కూడా ప్రయాణికులు కూర్చుని ప్రయాణించారు.





ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఫుట్‌బోర్డు మీద కూర్చుని ప్రయాణిస్తున్న దృశ్యం

ప్యాసింజర్ రైళ్లు తగ్గింపు

ఒకప్పుడు పేదల బండిగా ఉన్న రైలు ఇప్పుడు పేద వారికి అందని ద్రాక్షగా మారుతోంది. కేంద్రప్రభుత్వం ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్, వందేభారత్ వచ్చాక ప్యాసింజర్ రైళ్లను తగ్గించి వేయడమే కాకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను కాలక్రమేణా కుదిస్తూ వస్తోంది. రైళ్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచుతున్నామనే పేరుతో రైలు ప్రయాణాన్ని పేదలకు దూరం చేస్తోంది.

కిటకిట



నేను తిరుపతి వెళ్తున్నా. నేను ఎక్కిన రైలులో రెండు మాత్రమే జనరల్ బోగీలు. కిటకిటలాడుతున్నాయి. ఏ స్టేషన్‌లో అయినా తగ్గుతారని అనుకుంటే రైలు ఆగిన ప్రతి స్టేషన్‌లో జనం ఎక్కుతూనే ఉన్నారు. జనరల్ బోగీలను పెంచాలి.

– గాజులు రామాంజనేయులు, బయ్యవరం

బోగీలు తగ్గిస్తే ఎలా



కేంద్రం సామాన్య ప్రజలకు రైలు ప్రయాణం దూరం చేసేలా ఉంది. జనరల్ బోగీలు ఉండట్లేదు. స్లీపర్ కోచ్‌లు, ఏసీ కోచ్‌ల ధరలు అందని ద్రాక్షాలా ఉన్నాయి. నాలాంటి పేదల కోసం జనరల్ బోగీలు పెంచాల్సింది పోయి తగ్గిస్తే ఎలా?

– కుర్రా హనుమంతరావు, క్రోసూరు, పల్నాడు జిల్లా

ఉగ్గబట్టుకున్నాం



మాది తెనాలి. నేను శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కాను. ఎప్పుడు తెనాలి చేరుకుంటానా అని ఉగ్గబట్టుకుని కూర్చున్నా. భరించలేని దుర్వాసన, నిలబడేందుకూ స్థలం లేదు. ఫుట్ బోర్డుపై కూర్చుని ప్రయాణించాను.

– కూరపాటి సుదీప్, తెనాలి



ఫుట్‌బోర్డుపై కూర్చున్న మహిళా ప్రయాణికులు





శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీల్లో ప్రయాణికుల రద్దీ



కిటకిటలాడుతున్న శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కుతున్న ప్రయాణికులు

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం!

సత్తెనపల్లి: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తన మేనమామకు వేరొకరితో వివాహం చేస్తున్నారనే సమాచారం కారణంగా మనస్థాపం చెంది పారాసిట్‌మాల్ టాబ్లెట్లు అధికంగా మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. అయితే ఈ విషయాన్ని అటు తల్లిదండ్రులు కానీ, ఇటు కళాశాల యాజమాన్యం కానీ ధ్రువీకరించేందుకు ఇష్టపడటంలేదు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు. కానీ విద్యార్థిని ఆత్మహత్యయత్నం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

కుటుంబ కలహాలు, అప్పులతో రైతు ఆత్మహత్య


గొర్రెపాటి దానయ్య(ఫైల్)

క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన గొర్రెపాటి దానయ్య(65) సోమవారం కుటుంబ కలహాలు, వ్యవసాయంలో చోటు చేసుకున్న అప్పుల నేపథ్యంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఫిర్యాదులో తన తండ్రి కుటుంబ కలహాలు, వ్యవసాయంలో వచ్చిన నష్టాలతో అప్పులు అధికమవ్వటంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడన్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలదు. మంగళవారం పోస్టుమార్టం పూర్తిచేయించి, మృతదేహాన్ని కుటుంబీకులకు అందచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సరైన చర్య

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి సంఖ్యా బలం నిబంధన లేనప్పుడు అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సరైన చర్య అని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ స్పీకర్‌కు రాసిన లేఖపై సకాలంలో సరైన చర్య తీసుకోకపోవడం చట్టసభల విలువను దిగజార్చడమేనని అభిప్రాయపడ్డారు. పంతాలు, పట్టింపులకు కక్షలు కార్పన్యాలకు తావివ్వడానికి స్పీకర్ స్థానం ఆలంబన కాకూడదని ఈ సందర్భంగా వెల్లడించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3800, గరిష్ట ధర రూ.5000, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.

- ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు
- అవగాహన లేకపోతే జీవితం అథోగతిపాలు
- కొత్తగా చేరే విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాల నుంచి రక్షణ
- కళాశాలల్లో స్నేహపూర్వక వాతావరణం ఉండాలంటున్న మానసిక నిపుణులు
- తప్పుచేస్తే కఠిన శిక్షలు తప్పవంటున్న పోలీసులు
- నరసరావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ఘటన నేపథ్యంలో అప్రమత్తత అవసరం

వినోదం.. కారాదు విషాదం



ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి, నరసరావుపేట: ర్యాగింగ్.. సీనియర్లకు వినోదం, జూనియర్లకు ప్రాణసంకటం. మొదట సరదాగానే ఉన్నా ఒక్కోసారి పరిస్థితి చేయిదాటి విషాదంగా మారుతోంది. తాజాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలలో గతంలో జరిగిన ర్యాగింగ్ వీడియోలు బయటపడటంతో సీనియర్ విద్యార్థులపై కేసులు నమోదై వారి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఈ పరిస్థితి రాకుండా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సీనియర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను, శిక్షలను వివరించడంతో పాటు జూనియర్లతో స్నేహభావం కొనసాగించే విధానంపై అవగాహన కల్పించాలి. కొత్తగా కళాశాల మెట్లు ఎక్కుతున్న జూనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌తో ఇబ్బందిపడకుండా వారికి చట్టాలపై అవగాహన కల్పించాలి. త్వరలో ఉన్నత విద్యా తరగతులు మొదలవుతున్న నేపథ్యంలో వాటిపైన విద్యాసంస్థల యాజమాన్యాలు, పోలీసులు, తల్లిదండ్రులు దృష్టిపెట్టాలి.

సుప్రీంకోర్టు ఆదేశాలివే..

దేశవ్యాప్తంగా ర్యాగింగ్ నిరోధానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలను జారీచేసింది. అవి ఏమిటంటే..

- ర్యాగింగ్ నియంత్రణ బాధ్యత విద్యా సంస్థలదే. అందుకు కమిటీని ఏర్పాటుచేయాలి. ఈ కమిటీ సిఫార్సులను అమలుచేయాలి.
- కళాశాలల్లో సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహభావం పెంచేందుకు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించాలి.

ర్యాగింగ్ నేరానికి పడే శిక్షలు..

- విద్యార్థిని వెక్కిరించడం, అవమానపరచడం చేస్తే ఆరు నెలల జైలుశిక్ష లేదా రూ.1,000 జరిమానా ఉంటుంది. కొన్నిసార్లు రెండూ విధించవచ్చు
- విద్యార్థిపై దాడిచేయడం, హెచ్చరించడం, ఒత్తిడి చేయడం చేస్తే ఒక ఏడాది జైలుశిక్ష లేదా రూ.2 వేల జరిమానా. కొన్నిసార్లు రెండూ విధించవచ్చు.
- విద్యార్థి అక్రమ నిర్బంధం.. గాయపరచడం చేస్తే రెండేళ్ల జైలుశిక్ష లేదా రూ.5 వేల జరిమానా. కొన్నిసార్లు రెండూ విధించవచ్చు.
- విద్యార్థిని తీవ్రంగా గాయపరచడం, అపహరించటం, మానభంగం చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష లేదా రూ.10 వేల జరిమానా. కొన్నిసార్లు రెండూ విధించవచ్చు
- ఇక విద్యార్థిని హత్యచేయటం, ఆత్మహత్యకు పాల్పడేలా పరిస్థితులు సృష్టించడం పదేళ్ల జైలుశిక్ష లేదా రూ.50 వేలు జరిమానా. కొన్నిసార్లు రెండూ విధించవచ్చు.
- అలాగే, ర్యాగింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే విద్యా సంస్థల నుంచి తాత్కాలికంగా లేదా శాశ్వతంగా తొలగించొచ్చు. మరే విద్యాలయాల్లో ప్రవేశం పొందే అవకాశం ఉండదు.
- ప్రభుత్వ ఉద్యోగానికి అర్హతలేకుండా చేయడం, పాస్‌పోర్టు జారీచేయకుండా చర్యలు తీసుకోవచ్చు.
- ఉపకార వేతనాలు నిలిపివేయడం, పోటీ పరీక్షలకు హాజరుకాకుండా చేయడం, ఫలితాల నిలిపివేత, రూ.2.50 లక్షల వరకు జరిమానా విధించాలన్న యూజీసీ మార్గదర్శకాలు ఉన్నాయి.

- ర్యాగింగ్‌తో ఇబ్బందిపడితే ఎవరిని సంప్రదించాలో తెలిపే ఫోన్ నెంబర్లు, చిరునామాలు గోడలపై ప్రదర్శించాలి.

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి..

పిల్లలపట్ల తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా తప్పనిసరిగా ఉండాలి. మంచి కాలేజీలో చేర్పించాం, ఫీజులు కట్టేశాం అని ఊరుకోకుండా, వారెలా వ్యవహరిస్తున్నారు? వారి స్నేహితుల పరిస్థితి ఏమిటి? వంటి విషయాలను గమనిస్తుండాలి. వారితో నిరంతరం మాట్లాడుతుండాలి.

హెల్ప్‌లైన్ నంబర్..

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ స్థాయిలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ఓ హెల్ప్ లైన్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. బాధితులు తమ ఫిర్యాదును ఇందులో నమోదు చెయ్యొచ్చు. హెల్ప్‌లైన్ నంబర్ 1800-180-5522ను సంప్రదించవచ్చు.

భవిష్యత్తును పాడుచేసుకోవద్దు..



గతంతో పోలిస్తే ర్యాగింగ్ చట్టాల అమలు ప్రస్తుతం పక్కాగా ఉంది. ఘటన మా దృష్టికి రాగానే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. విద్యార్థులు విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.

– కంచి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా ఎస్పీ

సీనియర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలి



విద్యార్థులు సరదా కోసం చేసే ర్యాగింగ్‌తో జీవితాలు ప్రమాదంలో పడతాయి. ఒక్కోసారి క్రూరత్వానికి దారితీస్తుంది. జూనియర్స్‌లో అభద్రతా భావం, మానసిక ఒత్తిడి, అవమానభారం జీవితంపై విరక్తి పుట్టేలా చేస్తాయి. సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా ఆపాలి. ర్యాగింగ్‌కు గురైన వారిలో ఉన్న భయం, బాధ పోగొట్టేలా సాంత్వన పరచాలి.

– డాక్టర్ వీవీ కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, మానసిక వ్యాధుల వైద్యవిభాగం, జీజీహెచ్, గుంటూరు

ఎన్ఈసీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల సాహసం

- 3,200 అడుగుల గోరిచెన్ మంచు పర్వతాన్ని అధిరోహించిన క్యాడెట్లు
- క్యాడెట్లను సత్కరించిన గ్రూపు కమాండర్, కళాశాల పాలకవర్గం


గోరిచెన్ మంచు పర్వతాన్ని అధిరోహించిన ఎన్‌సీసీ క్యాడెట్లు సుస్వంత్, ఆర్తిలు

నరసరావుపేట రూరల్: పర్వతారోహణలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చాటారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని 3,200 అడుగుల ఎత్తయిన గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని దిరాంగ్‌లో మే 25 నుంచి జూన్ 25 వరకు ట్రెక్కింగ్, పర్వతారోహణ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా దిరాంగ్ న్యూమెల్లింగ్, మాగో జీతాంగ్, మీరథాన్‌తో పాటు అతి ఎత్తయిన గోరిచేన్ గ్లేసియర్ మంచు పర్వతాన్ని అధిరోహించడంతో పాటు ఆర్టిఫిషియల్ వాల్ క్లైంబింగ్, ఐస్ వాల్ క్లైంబింగ్, రివర్ క్రాసింగ్ తదితర సాహస కార్యక్రమాలు నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎం.వెంకట సుస్వంత్, ఎ.ఆర్తిలు క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. గోరిచెన్ గ్లేసియర్ మంచు పర్వతాన్నిఅధిరోహించి రికార్డు సృష్టించారు. గుంటూరు గ్రూపు ఎన్‌సీసీ కార్యాలయంలో గ్రూపు కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ వీరికి ధ్రువీకరణపత్రాన్ని అందజేసి సత్కరించారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు సన్మానించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో అలసత్వం వద్దు

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- పలు పోలీస్ స్టేషన్ల సందర్శన

యడ్లపాడు: పెండింగ్ కేసుల పరిష్కారంలో అలసత్వం వహించరాదని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాత్రి యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చిన ఆయన స్టేషన్‌లోని పెండింగ్ కేసుల వివరాలు, సిబ్బంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ నిర్వహించే రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. చోరీల కేసులు అధికం అవుతున్నాయంటూ విలేకరులు అడిగిన ప్రశ్నలకు సిబ్బంది కొరత ఉందని, పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌బీ సీఐ శోభన్‌బాబు, చిలకలూరిపేట రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఇన్‌చార్జి ఎస్ఐ బలరామిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.


చిలకలూరిపేటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

శాంతియుత వాతావరణంలో జీవించాలి..

చిలకలూరిపేటటౌన్: జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాత్రి చిలకలూరిపేట పట్టణంలోని 52 ఎకరాల గృహ సముదాయాల్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అపార్టుమెంట్ల నివాసితుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే కటాకటాల పాలు కావాల్సిందేనన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఏ చిన్న సంఘటనకైనా ఉపేక్షించేది లేదన్నారు. అనవరస ఘర్షణలు పడి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, కుటుంబ పరంగా నష్టపోవద్దని సూచించారు. వివాదాలకు దూరంగా ప్రశాంత జీవనం గడిపేందుకు అంతా భాగస్వాములు కావాలన్నారు. అర్బన్ స్టేషన్ సీఐ పి.రమేష్, ఎస్ఐ జి.పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాదెండ్ల పీఎస్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

నాదెండ్ల: నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌ను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పీఎస్‌కు ఆయన విచ్చేసి, రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు, దర్యాప్తు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇటీవల స్టేషన్ పరిధిలో బాలికపై వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన ఘటనకు సంబంధించి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అమరావతి స్థూపాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించాలి

అమరావతి: ఎంతో పురాతనమైన అమరావతి స్థూపాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించాలని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశంలో కోరామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన ఫోన్‌లో సమావేశ వివరాలను తెలియజేశారు. రాష్ట్రంలోని గండికోట, అమరావతి, నాగార్జునకొండ, సాలిహుండం, శంకరంలలోని కట్టడాలు, స్థూపాలకు ప్రపంచ వారసత్వ కట్టడాల హోదా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న చారిత్రక కట్టడాలు, స్మారకాల చరిత్ర అపూర్వమని తెలియజేశామని తెలిపారు. శిల్పకళకు, వర్ణచిత్రాలకు నిలయమైన లేపాక్షిని యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా తాత్కాలిక జాబితాలో మాత్రమే చేర్చిందన్నారు. శాశ్వత జాబితాలో చోటు దక్కే విధంగా కొన్ని సమస్యలను అధిగమించి యునెస్కో నియమ నిబంధన ప్రకారం నివేదిక తయారుచేసి పంపటానికి కృషి చేయాలన్నారు. జూలై 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భారతమండపంలో ప్రారంభమైన ఈ సమావేశంలో 165 దేశాల నుంచి 3000 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సమావేశాలు ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 129 కట్టడాలలో ఒక్క దానిని కూడా యునెస్కో ఫైనల్ జాబితాలో చోటు లేకపోవటాన్ని సమావేశం దృష్టికి తెచ్చామన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విలువైన శిల్పకళ, కుడ్య చిత్రాలకు నిలయమైన లేపాక్షిని ప్రపంచ వారసత్వ కట్టడంగా శాశ్వత జాబితాలో చేర్చాలని వివరించామన్నారు. యునెస్కో తాత్కాలిక జాబితాలోకి ఎంతో ఘన చరిత్ర ఉన్న అమరావతి, నాగార్జునకొండ, గండికోట, సాలిహుండం, శంకరం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరామన్నారు. ఈసమావేశాలలో తెలుగు రాష్ట్రాల నుంచి స్తపతి ష్లీచ్ ఇండియా సీఈఓ, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.


యునెస్కో కమిటీ 46వ సమావేశంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

ముగిసిన జేఎన్‌వీ సైన్స్ ఎగ్జిబిషన్

పల్నాడు జేఎన్‌వీకు ఐదు విభాగాల్లోనూ బహుమతులు


లైఫ్, ఎన్విరాన్‌మెంట్‌లో ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థి చైతన్య

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జీవవైవిధ్య విధ్వంసాన్ని సృష్టించే పెను సవాళ్లకు శాశ్వత పరిష్కార మార్గాల్ని అన్వేషించేందుకు విద్యార్థులు మేథోమథనం చేయాలని యూబీఐ పండరీపురంశాఖ మేనేజర్ రోహిత్‌సిన్హా కోరారు. జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ) పాఠశాలలకు నిర్వహించిన క్లస్టర్‌స్థాయి శాస్త్రీయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు మంగళవారం ముగిశాయి. జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు శ్రీకాకుళం నుంచి ఉమ్మడి గుంటూరు వరకు 9 జిల్లాల చెందిన జేఎన్‌వీ విద్యార్థులు హాజరయ్యారు. ఇందుకు చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామంలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం వేదికైంది. ఆధునిక, సాంకేతిక సమస్యల్ని పరిష్కరించే 57 నమూనాలను విద్యార్థులు ప్రదర్శనకు తెచ్చారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోహిత్‌సిన్హా మాట్లాడుతూ శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. విద్యార్థులు నవీన ఆవిష్కరణలతో సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహరావు మాట్లాడుతూ ఆయా ప్రదర్శన పోటీలను వీక్షించిన న్యాయ నిర్ణేతలు ఉత్తమమైన వాటిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులు తమ నమూనాలను త్వరలో కేరళలో జరిగే జేఎన్‌వీ ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రదర్శించనున్నారన్నారు. విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు.

జేఎన్‌వీ క్లస్టర్ లెవల్ పోటీల విజేతలు వీరే...

క్లస్టర్ పోటీల్లో ప్రధానంగా ఐదు విభాగాల్లో విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. జీవితం, పర్యావరణం విభాగంలో కె.చైతన్య (మద్దిరాల జేఎన్‌వీ, పల్నాడు), కె.రఖీల్ సుదీప్, డి.నవ్య చాందిని (జేఎన్‌వీ, కృష్ణా) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో విజేతలుగా నిలిచారు. వ్యవసాయంలో.. జి.కీర్తిప్రయాంక (ఈస్ట్‌గోదావరి-1), జి.లావణ్య క్రిష్టినా (పల్నాడు), కె.నవీన్ కుమార్ (శ్రీకాకుళం), ఆరోగ్యంలో.. కేవీఎన్ స్వప్నశ్రీ (కృష్ణా), జ్ఞానశ్రీ (పల్నాడు), ఎం.శివాజీ(యానాం), కమ్యూనికేషన్, ట్రాన్స్‌పోర్టులో.. ఎం.మణికంఠ (పల్నాడు), బి.శ్రీహరి(యానం), తేజేస్విని(విజయనగరం), కంప్యూటేషనల్ థింకింగ్‌లో..ఆర్.ప్రసన్నలక్ష్మి (పల్నాడు), భానుశంకర్ (శ్రీకాకుళం), ఎంపీడీ సాయికుమార్(విశాఖపట్నం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు

డీఎస్పీ శ్రీనివాసరావు



విలేకరులతో మాట్లాడుతున్న గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, పక్కన సీఐ బాలాజీ

మాచర్ల రూరల్: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడితే వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని గురజాల డీఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మాచర్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్దుర్తి మండలంలోని హనుమాపురంతండా ప్రాంతంలో అలుగు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఫారెస్టు అధికారిపై దాడికి పాల్పడిన సంఘటనపై ఆయన స్పందించారు. వెల్దుర్తి మండలం అటవీ ప్రాంతంలో కొంతకాలంగా కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి వన్యప్రాణులను స్మగ్లింగ్ చేస్తున్నారని, ఈ క్రమంలోనే హనుమాపురం తండాకు చెందిన దేశావత్ గోవింద్‌నాయక్, అటవీ ప్రాంతంలోని వన్యప్రాణి అయిన అలుగును అమ్మేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వీపీ సౌత్ ఫారెస్టు రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న గోవింద్ నాయక్‌ను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా ఆ వాహనం పై పలువురు వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లదాడికి పాల్పడి సత్యనారాయణరెడ్డిని తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ సంఘటన పై పోలీసులు వెంటనే స్పందించి ఐదుగురిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. పరారీలో ఉన్నవారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఈ విషయంలో ఎవరు తమపై ఎవరు ఒత్తిడి చేసినా వదిలే ప్రసక్తి ఉండదన్నారు. శాంతి భద్రతలు కాపాడటంలో ఉన్నతాధికారులు తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ప్రజలకు రక్షణ కల్పించటంలో పోలీసు శాఖ నిస్వార్థంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రూరల్ సీఐ బాలాజీ, వెల్దుర్తి ఎస్ఐ ఎం.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు అర్జీ


అర్జీ చూపుతున్న రమాదేవి, పెద్దిశెట్టి

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామానికి చెందిన ఆత్మకూరి రమాదేవి, పెద్దిశెట్టిలు తమకు గ్రామంలోని కొందరి ద్వారా ప్రాణ భయం ఉందని మంగళవారం జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు, అమర లింగేశ్వరరావు, ఆదిలక్ష్మి మరి కొందరు తమ ఇంటిని పొక్లెయిన్‌తో పడేసి తమను దుర్భాషలాడి కొట్టారన్నారు. దీనిపై రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తాము పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని వారు బెదిరిస్తున్నారన్నారు. కేసు ఉపసంహరించుకోకపోతే చంపేస్తామని హెచ్చరించారన్నారు. తమపై దాడి చేసి ఆస్తినష్టం కలుగచేసిన వారిని శిక్షించి తమకు ప్రాణరక్షణ కల్పించాలని అర్జీలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్యామల రాజగోపాల్‌రెడ్డి(50) మధ్యాహ్నం సమయంలో తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతూ ఉండగా చిలకలూరిపేట నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళ పొత్తూరు వద్ద హైవే అండర్‌పాస్ వద్ద ఢీకొంది. ప్రమాదంలో రాజగోపాల్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై మృతుడి భార్య శ్యామల లక్ష్మీకాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

కౌలు రైతు మృతదేహానికి పోస్టుమార్టం

ఖననం చేసిన రెండురోజుల తర్వాత బయటకు తీసి శవ పంచనామా


కౌలురైతు మృతదేహానికి పోస్టుమార్టం చేస్తున్న వైద్యులు

ప్రత్తిపాడు: అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు మృతదేహాన్ని ఖననం చేసిన రెండు రోజుల తరువాత బయటకు తీసి అధికారులు శవ పంచనామా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన ధూపాటి శివయ్య ఈ నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అతని బంధువులు 28న అదే గ్రామంలో ఖననం చేశారు. ఖననం చేసిన తరువాత అతని భార్య ముత్తమ్మ తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన తరువాత కచ్చితంగా పోస్టుమార్టం చేయాల్సిల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం శివయ్య మృతదేహాన్ని పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో బయటకు తీశారు. తొలుత రెవెన్యూ అధికారులు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం ఫోరెన్సిక్ గుంటూరు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాఫర్ హుస్సేన్ పోస్టుమార్టం చేశారు. తహసీల్దార్ కె. రవిబాబు, ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్రలు మృతుని భార్యను విచారించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.